# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు మంత్రివర్గ సమావేశం జరిగింది.
- ఆంధ్రప్రదేశ్ డ్రోన్ పాలసీకి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.
- తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్‌గా బీ.ఆర్. నాయుడు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో కూర్మనాధ స్వామి వారి తెప్పోత్సవం ఈనెల 13వ తేదీన జరగనుంది.

=======================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2014 నుండి 2019 మధ్య కాలంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలో పూర్తి అయిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుకు కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్ 2024ను ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 స్థానంలో తీసుకురావడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధ సారథి తెలిపారు. అలాగే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 45 సెకన్లు)

=======================

డ్రోన్ రంగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచ గమ్యస్థానంగా నిలపాలనే లక్ష్యంతో అమరావతి - ఏపీ డ్రోన్ పాలసీకి రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు ఆమోదం తెలిపిందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసుపార్థసారథి

పేర్కొన్నారు. వెయ్యి కోట్ల పెట్టుబడుల లక్ష్యంగా ఏపీ డ్రోన్ కార్పోరేషన్ డ్రోన్ పాలసీ 2024-29ను ముసాయిధాను పొందించామని ఆయన వెల్లడించారు. 3 వేల కోట్ల రూపాయల రాబడి, 40 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఈ పాలసీని తయారు చేశామన్నారు. డ్రోన్ రంగంలో పరిశోధనలు చేపట్టే విద్యా సంస్థలకు 20 లక్షల రూపాయల ప్రోత్సాహం అందిస్తామన్నారు. డ్రోన్ హబ్ గా ఓర్వకల్లును తీర్చిదిద్దుతున్నన్నామని, 300 ఎకరాల్లో డ్రోన్ తయారీ, టెస్టింగ్, ఆర్ అండ్ డీ ఫెసిలిటీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు.

=======================

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్‌గా బీ.ఆర్. నాయుడు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావు ఆయనతో ప్రమాణం చేయించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో బీఆర్ నాయుడు, 16 మంది పాలక మండలి సభ్యులతో కలిసి ప్రమాణం చేశారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు.

=======================

శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం గ్రామంలో కొలువైన శ్రీ కూర్మనాధ స్వామి వారి తెప్పోత్సవం ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి జి.గురునాధరావు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్వామి వారి దేవాలయం ఎదురుగా ఉన్న శ్వేత పుష్కరిణిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ తెప్పోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుకానున్న నేపధ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గురునాధరావు తెలిపారు.

=======================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కొద్దిసేపటి క్రితం ఢిల్లీకి బయలుదేరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈ రోజు సాయంత్రం కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాతో ఉప ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

=======================

తక్కువ నీటి సాంద్రతతో అధిక దిగుబడినిచ్చే పంటలను రైతులు సాగుచేసుకొనేలా ప్రోత్సహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో ప్రాధమిక రంగాలకు సంబంధించిన శాఖలతో కలెక్టర్ సమీక్షనిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అధిక దిగుబడితో పాటు అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించి, రైతులు పండించేలా అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తూనే, పంట బీమా అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో గొర్రెల పెంపకం యూనిట్లు సంఖ్య మరింత పెరగాలన్నారు.

=======================

మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఈరోజు అనంతపురంలో సహాయ సహకార సంఘాల ఫెడరేషన్ లిమిటెడ్ 20వ వార్షిక మహాసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల మహిళలతో మండల, జిల్లా సమాఖ్యలు ఏర్పాటు చేయడం, అందులో మహిళలను సభ్యులుగా చేయడంలో అనంతపురం జిల్లా ముందుందని, ఇందుకు చాలా గర్వకారణంగా ఉందన్నారు.

విరామం

======================

కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ పార్లమెంటరీ దేశాల ప్రతినిధులతో కలిసి పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కి పురంధేశ్వరి హాజరయ్యారు. ఈ సదస్సులో అర్ధవంతమైన చర్చలు జరుగుతున్నాయని సామాజిక మాధ్యమం వేదికగా ఆమె తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా సాధికారత కోసం భారతదేశంలో చేపడుతున్న సానుకూల అంశాలను సవివరంగా వివరించడానికి ఈ సదస్సు మంచి వేదికగా నిలిచిందన్నారు.

======================

ద్విచక్ర వాహనాలు నడిపే వారందరు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాలు, హైకోర్టు సూచనల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాన్ని నడిపే వారు హెల్మెట్లు ధరించని కారణంగా ప్రమాద సమయంలో గాయాలు ఎక్కువగా తగిలే అవకాశం ఉందని న్యాయమూర్తి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

వెనుకబడిన వర్గాలకు అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించేందుకు విజయనగరం జిల్లా ఎల్.కోటలో నవంబర్ 8వ తేదీన ఏపి నేర పరిశోధన శాఖ (ఏపి సిఐడి) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు విశాఖలోని ఏపీ సిఐడి అదనపు ఎస్పీ డాక్టర్ జి. ప్రేమ్ కాజల్ తెలిపారు. వెనుకబడిన వర్గాల హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా ఆయా వర్గాల్లో సామాజిక సాధికారత సాధించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని సిఐడి అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

======================

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. ఈరోజు సారవకోట మండలం, అంగూరు గ్రామంలో ఈరోజు జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. సర్వేలో ఏమైనా లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్లు అందరూ క్షేత్రస్థాయికి వెళ్లి సర్వేలు నిర్వహించాలని సూచించారు.

======================

దక్షిణ మధ్య బంగాళాఖాతంపై సముద్ర మట్టానికి 3 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర, ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. దీని ప్రభావంతో ఉత్తర, దక్షిణ కోస్తాలో, రాగల 24 గంటలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 4 డిగ్రీలు అధికంగా నమోదు అయ్యే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

======================

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ.. వారికి ఎల్లప్పుడూ బాసటగా  నిలుస్తామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈరోజు భీమవరంలో అంతర్జాతీయ వయోవృద్ధులు వేడుకల సందర్భంగా వృద్ధుల పోషణ, సంక్షేమ నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వృద్ధులు, తల్లిదండ్రులు పట్ల ప్రేమాభిమానాలు కలిగి బాధ్యతగా మెలగాలన్నారు. ప్రతి సోమవారం “మీకోసం” కార్యక్రమంలో వృద్ధుల ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి వృద్ధులు ఒక గొప్ప ఆస్తి అని, వారు తమ అపార అనుభవాన్ని, జ్ఞానాన్ని యువతకు అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

========================

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తల్లిపాలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు, అనంతరం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాలు నిర్మూలనలో వివిధ అధికారుల సమన్వయంపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మండల పరిషత్ సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల పాత్రపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు.

========================
========================